క్లుప్తంగా


డ్రైనేజీల పరిశీలన



డ్రైనేజీని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డు, బీసీ కాలనీ, ఆర్ఎస్‌లోని డ్రైనేజీ కాలువలను గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ కాలువల్లో చెత్త, మురికి పేరుకుపోయిందన్నారు. వర్కర్లతో శుభ్రం చేయించడం సాధ్యం కాదన్నారు. జేసీబీల సాయంతో త్వరలోనే డ్రైనేజీ కాలువలన్నింటినీ శుభ్రం చేయిస్తామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, శానిటరీ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తే కఠిన చర్యలు



చిట్టూరు వద్ద పెన్నానదిలో ఇసుక తరలించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

పెద్దవడుగూరు: ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం మండలంలోని చిట్టూరు, కొండూరు తదితర గ్రామాల్లోని పెన్నానది ప్రాంతాలను ఆయన పరిశీలించారు. అక్రమ తవ్వకాలు జరిగే ప్రాంతాలపై నిఘా పెట్టినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చే వరకూ ఎవరూ ఇసుకను తరలించడానికి వీలు లేదన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పెద్దపప్పూరు: మండలంలోని జూటూరు గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పెద్దపప్పూరు ఇన్‌చార్జి ఎస్ఐ గౌస్‌బాషా సీజ్ చేశారు. వివరాలు.. తిమ్మనచెరువు గ్రామానికి చెందిన రాజశేఖర్ తాడిపత్రి మండలం కోమలివైపు నుంచి ఇసుక లోడుతో వస్తుండగా జూటూరు రైల్వే బ్రిడ్జి సమీపంలో పోలీసులు ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. యజమాని రాజశేఖర్‌పై కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను సీజ్‌చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడొద్దు



కోమటికుంట్లలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ సుబ్రహ్మణ్యం

పుట్లూరు: చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని కోమటికుంట్లలో పర్యటించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్రహ్మణ్యం, స్పెషల్ పార్టీ పోలీసులతో కలసి గ్రామంలో కవాతు నిర్వహించారు. టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎరికలయ్య మృతి చెందటంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. గ్రామంలో పికెట్ ఏర్పాటు చేసి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విద్యాసామగ్రి వితరణ

పామిడి: పట్టణంలోని టీసీ హైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం స్థానిక పంజాబీ ఖల్సా దాబా నిర్వాహకుడు తేజ ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కే రామ్‌కుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థి షఫీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల: సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పాలన సాగిస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. గురువారం ఎంపీపీ యోగేశ్వరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే హాజరై ప్రసంగించారు. వచ్చే నెల 1 పింఛన్‌దారులకు రూ.7 వేలు అందజేస్తామన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి అధికారులందరూ సహకరించాలన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికి అధికారులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నరసింహులు, విజయ, తహసీల్దార్ మోహన్ బాబు, ఎంపీడీఓ రమణ, ఏఓ అన్వేష్‌కుమార్, ఎంఈఓ నరసింహరాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువుల ఆస్పత్రి

- పట్టించుకోని అధికారులు
- అవస్థల్లో వైద్య సిబ్బంది

తాడిపత్రి రూరల్: పట్టణంలోని ప్రభుత్వ పశువుల ఆస్పత్రి శిథిలావస్థకు చేరుకుంది. 1962లో ప్రభుత్వాస్పత్రికి పక్కా భవనం నిర్మించారు. అప్పటి నుంచి మరమ్మతుల గురించి పట్టించుకునే నాథుడే లేడు. శిథిలావస్థకు చేరుకున్న భవనంలో డాక్టర్‌తోపాటు సిబ్బంది బిక్కు, బిక్కుమంటూ వైద్యం చేస్తున్నారు. కొత్త భవన నిర్మాణం కోసం పలుమార్లు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు చేయడంలో ఉన్నతాధికారులు దాటవేత ధోరణి అవలంభిస్తుండడంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పలేదు.

పాములు, విష కీటకాలతో సహవాసం

ఆస్పత్రి చుట్టూ ముళ్ల కంపలు పెరిగాయి. వాటిని తొలగించేందుకు అవసరమైన నిధులు మంజూరు కాకపోవడంతో పెద్ద ఎత్తున విస్తరించాయి. ముళ్ల కంపలు పెరగడంతో పాములు, విష కీటకాలు స్థావరంగా ఏర్పరుచుకున్నాయి. కిటికీల నుంచి లోపలికి పాములు, విషకీటకాలు వస్తున్నాయని సిబ్బంది వాపోతున్నారు. ఇదే విషయాన్ని అధికారులకు చెప్పి ముళ్లకంపలు తొలగించాలని కోరినా ఫలితం లేకపోతోందని అవేదన చెందుతున్నారు.

వర్షం వస్తే కరెంట్ షాక్

ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో చిన్నపాటి వర్షం కురిసినా బిల్డింగ్ షాక్ కొడుతోంది.



అధ్వానంగా మారిన పశువుల ఆస్పత్రి భవనం



అపరిశుభ్రంగా ఉన్న మందుల గది



నెర్రలు చీలిన పైభాగం

బిల్డింగ్ కారుతుంటంతో కరెంట్ సరఫరా అవుతోంది. విద్యుత్ వైరింగ్ సరిగా చేయకపోవడం వల్ల బిల్డింగ్‌కు కరెంట్ సరఫరా అవుతోంది. వైరింగ్ చేయించుకోవడానికి నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పెట్టి నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అవసరమైన గదులు, ఫర్నీచర్ లేక డాక్టర్‌తోపాటు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. రెండు అటెంటర్ పోస్టులు, మూడు అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయలేదు. వాచ్‌మెన్ లేకపోవడంతో పలుమార్లు ఆసుపత్రిలో దొంగతనాలు జరిగాయి. తలుపులు పగలకొట్టి విలువైన సామాగ్రిని దోచుకెళ్లారు. ఆసుపత్రిలో అవసరమైన మందులను దాచుకునేందుకు సౌకర్యాలు లేవు. అత్యవసరమైన మందులను మాత్రమే ఉన్న మూడు బీరువాల్లో భద్రపరుచుకుంటున్నారు. మిగిలిన వాటిని భద్రపరుచుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. వివిధ రకాల వ్యాక్సిన్‌లను భద్రపరచడం కోసం దాదాపు రూ.2.40 లక్షల విలువైన రిఫ్రిజిరేటర్, రూ.70 వేల డీఫ్రిజర్ వచ్చినా వాటిని ఎక్కడ పెట్టుకోవాలో తెలియక ప్యాకింగ్ కూడా తీయకుండా మూలన పెట్టారు.

అరకొర సౌకర్యాలతో వైద్యం



ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకున్నా అరకొర సౌకర్యాలతో సిబ్బంది చేత పనులు చేయించాల్సి వస్తోంది. రోజూ 50కి పైగా పశువులు, ఇతర జంతువులకు వైద్యం చేస్తున్నాం. బిల్డింగ్‌లోకి పాములు, విష కీటకాలు వస్తున్నాయని సిబ్బంది భయపడుతున్నారు. వర్షం కురిస్తే బిల్డింగ్‌కు కరెంట్ షాక్ వస్తోందని ఆందోళన చెందుతున్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– ఖాదిర్‌బాషా, పశువైద్యుడు

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పామిడి మండలం రామగిరి ఎగువతండాలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి



గుంతకల్లులో డయేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



తాడిపత్రి మండలంలోని పెద్ద పొలమడలో మాట్లాడుతున్న వైద్యాధికారులు

పామిడి: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని గుంతకల్ ఆర్డీఓ వీ శ్రీనివాసరెడ్డి సూచించారు. గురువారం ఆయన రామగిరి ఎగువతండాలో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన గ్రామంలోని పారిశుధ్యం, తాగునీటి సర్వేలె, వైద్యశిబిరాన్ని పరిశీలించారు. ఎద్దులపల్లి వైద్యాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో డాక్టర్ ఉదయార్క్, ఆరోగ్య సిబ్బంది నిర్వహించిన శిబిరంలో ఐదు డయేరియా కేసులను గుర్తించారు. అందులో మూడు కేసులకు వారు అక్కడికక్కడే చికిత్స చేసి వైద్యసేవలు అందించారు. మిగతా రెండు కేసులను ఎద్దులపల్లి పీహెచ్‌సీకి రెఫర్ చేశారు. ఈసందర్భంగా వారు నాలుగు బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి క్లోరిన్ మాత్రలు పంపిణీ చేశారు. అలాగే ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని పారవేసి, క్లోరినేషన్ చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఆరోగ్య, ఆశా, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించండి

గుంతకల్లుటౌన్: డయేరియా వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మెప్మా సీఎంఎం భవాని సూచించారు. గురువారం పాతగుత్తి రోడ్డులోని టీఎల్ఎఫ్ కార్యాలయంలో డయేరియా లక్షణాలు, నియంత్రణపై డ్వాక్రా సంఘాల లీడర్లకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కలుషితమైన ఆహారాన్ని తినకూడదని, శుద్ధిచేసిన నీటినే తాగాలని, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, ఏఎన్ఎం వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాచి వడబోసిన నీటినే తాగండి

తాడిపత్రిటౌన్: కాచి వడబోసిన నీటినే తాగాలని వైద్యాధికారులు సుమన్, అశ్విని సూచించారు. మండలంలోని పెద్ద పొలమడ ప్రభుత్వ పాఠశాలలో గురువారం అతిసారం నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ వాంతులు, విరేచనాలు అవుతుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ వాసుదేవరెడ్డి, సూపర్‌వైజర్ క్రిష్ణమోహన్, పాఠశాల హెచ్ఎం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నివారిద్దాం

పెద్దవడుగూరు: డయేరియా నివారణకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని తాడిపత్రి సీడీపీఓ షాజిదా బేగం సూచించారు. గురువారం మండలంలోని గోపురాజుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు డయేరియా నివారణపై అవగాహన కార్యకరమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శుద్ధి చేసిన నీరు తాగాలన్నారు. కలుషితమైన తాగునీరు తాగడం వలన కలిగే నష్టాలను వివరించారు. భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. అనంతరం చిన్నారులతో మొక్కలను నాటించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు దస్తగిరమ్మ, వెంకటలక్ష్మి, ఏఎన్ఎం నిర్మల, సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దవడుగూరు మండలం గోపురాజుపల్లిలో అంగన్‌వాడీ చిన్నారులతో చేతులు శుభ్రం చేయిస్తున్న సీడీపీఓ షాజిదాబేగం

ఆరోగ్య పరిరక్షణలో జాగ్రత్తలు అవసరం



మాట్లాడుతున్న రజిత

బుక్కరాయసముద్రం: విద్యార్థులకు చదువులతో పాటు ఆరోగ్య పరిరక్షణలో జాగ్రత్తలు అవసరమని ఆర్‌బీఎస్‌కే మేనేజర్ రజిత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలలో ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా సికిల్ సెల్ అనీమియాపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచు కోవాలన్నారు. రోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. యోగా, వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమలో మండల డాక్టర్ తెహరున్నీసా, ప్రిన్సిపాల్ హర్జే నాయక్, సీహెచ్ఓ మోహన్‌రావు, ఈశ్వరమ్మ, నాగలక్ష్మి, సత్యనారాయణ శాస్త్రి, ఆనంద్, ధనుంజయ, లక్ష్మిదేవి, పీఈటీ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై దాడి

గార్లదిన్నె: మండలంలోని జంబులదిన్నెలో ఓ వృద్ధురాలిపై దాడి సంఘటన చోటు చేసుకుంది. గురువారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన చిన్న సుబ్బన్న అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన పుల్లమ్మ అనే వృద్ధురాలి కుమార్తెతో చనువుగా ఉండేవారన్నారు. గత కొన్ని రోజులుగా వృద్ధురాలు కుమార్తె గ్రామంలో లేదన్నారు. బుధవారం వృద్ధురాలు గార్లదిన్నె నుంచి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా..ఆమె కుమార్తె విషయంలో చిన్న సుబ్బన్న వృద్ధురాలితో గొడవపడ్డాడన్నారు. వృద్ధురాలిపై దాడి చేసి జంబులదిన్నె చెరువులోని బురదలోకి తోసేశాడన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆత్మగౌరవ జాతరకు తరలిరండి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మార్పీస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదినారాయణ

పెద్దపప్పూరు: ఎమ్మార్పీస్ ఆవిర్భవించి 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జూలై 7న తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్‌లో నిర్వహించే ఆత్మగౌరవ జాతరకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఆదినారాయణ అన్నారు. గురువారం మండలంలోని తబ్జుల అంబేడ్కర్ కాలనీలో ఆయన ఇంటింటికీ తిరిగి ముమ్మర ప్రచారం చేశారు. దళితుల సంక్షేమం కోసం మందకృష్ణ మాదిగ కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజక వర్గ ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, మహేష్, శివప్రసాదు, ఓబులేసు, రాముడు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి



గుంతకల్లులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



గుత్తిలో సీఎస్‌డీటీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గుంతకల్లు రూరల్: రైతు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతూ సీపీఐ, రైతు సంఘం నాయకులు గురువారం తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20 వేలు ఈ ఖరీఫ్‌లోనే రైతులకు అందించాలని కోరారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చుల కనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంటల రుణాలు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ పావలా వడ్డీతో ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపుకార్డులిచ్చి రుణాలను మంజూరు చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి పి.రామాంజనేయులు, కే.దేవేంద్ర, ఎస్.బాషా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వడ్డీ లేని రుణాలను అందించండి

గుత్తి రూరల్: రైతులకు పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా రూ.3 లక్షల వరకూ వడ్డీ లేని రుణాలను అందించాలని సీపీఐ అనుబంధ ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వెంకట్రాముడు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సీపీఐ మండల కార్యదర్శి రాందాసు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం రైతు సమస్యలపై వారు ఆందోళన చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సీఎస్‌డీటీ సూర్యనారాయణకు అందజేశారు. వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20వేలను ఈ ఖరీఫ్ సీజన్‌లోనే రైతుల ఖాతాలలో జమ చేయాలన్నారు. అవసరమైన ఎద్దుల బండ్లు, నాగలి తదితర పనిముట్లు కొనుగోలుకు 50 శాతం రాయితీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజు, నజీర్, షఫీ, డానియల్, ఓబులేసు, మక్బూల్‌బాషా పాల్గొన్నారు.

పుట్లూరు: ఖరీఫ్‌లో రైతులు పంటలను సాగు చేసుకోవడానికి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ఒకే విడతలో సాయం అందించాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అధికారులకు వినతి పత్రం అందించిన నాయకులు తమ డిమాండ్లను వెంటనే అమలు చేయాలన్నారు. విద్యుత్ మోటర్లకు మీటర్ల ఏర్పాటు నిలిపివేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు అందించాలని, పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకుని రుణాలను పెంచాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి




ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

యాడికి: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు చేపడుతూ అప్రమత్తంగా ఉండాలని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు మలేరియా, డెంగీపై అవగాహన కల్పించారు. మురుగు కాల్వలు, గుంతలు, పాత టైర్లు, కుండల్లో నీటి నిల్వలు ఉండకుండా చూడాలన్నారు. రాత్రిపూట దోమ తెరలు వాడాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగన్న, ఉపాధ్యాయులు, పాఠశాల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో కోతుల బెడద

గుత్తి: గుత్తి రైల్వే స్టేషన్‌లో ఇటీవల కోతుల బెడద అధికమైంది. దీంతో ప్రయాణికులు, తినుబండారాల విక్రయదారులు బెంబేలెత్తిపోతున్నారు. కోతులు దాడి చేస్తుండటంతో వారు భయాందోళన చెందుతున్నారు. కోతుల నిర్మూలనకు రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



రైల్వే స్టేషన్‌లో సంచరిస్తున్న కోతులు

పంట మార్పిడితో అధిక దిగుబడులు

గార్లదిన్నె: ఖరీఫ్‌లో రైతులు ఒకే రకమైన పంట సాగు చేయకుండా పంట మార్పిడి చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ మద్దిలేటి సూచించారు. గురువారం మండలంలోని కల్లూరు ఆర్బీకేలో రైతులకు పంటల సాగుపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని పంటలు సాగు చేసుకోవాలన్నారు. అలాగే భూసార పరీక్షలు ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. రసాయన ఎరువులు వాడితే భూమిలో కర్బన్ శాతం తగ్గి పోతుందన్నారు. దీంతో పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాదన్నారు. ఒకే రకమైన పంటలు సాగు చేయడం వల్ల భూసారం తగ్గుతుందని, పంట మార్పిడి చేస్తే మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. అనంతరం వరి, వేరుశనగ, కంది, ఆముదం ,పత్తి పంటలు సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అనంతపురం వ్యవసాయ శాఖ ఏడీ రవి, ఎఫ్‌టీసీ ఏడీఏ శైలజకుమారి, ఏఓ సోమశేఖర్, ఏఈఓ స్రవంతి, రైతులు పాల్గొన్నారు.



రైతులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

పరామర్శ



మల్లికార్జునను పరామర్శిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

పుట్లూరు: మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లికార్జుననను గురువారం ఆ పార్టీ జిల్లా నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి పరామర్శించారు. కొన్ని రోజుల క్రితం గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకుని మల్లికార్జున ఆస్పత్రి నుంచి ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.రాఘవరెడ్డి, సర్పంచ్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘లోక్ అదాలత్’ను విజయవంతం చేయండి

గుత్తి: పట్టణంలోని ఏడీజే, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులలో ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఏడీజే శ్రీహరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో రాజీకి అవకాశమున్న కేసులన్నింటినీ పరిష్కారం చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కక్షిదారులు హాజరై లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘనంగా బంకిం చంద్ర చటర్జీ జయంతి

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ భవనంలో గురువారం వందేమాతరం గీత రచయిత బంకిం చంద్ర చటర్జీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు అబూ బకర్ ఆధ్వర్యంలో పెన్షనర్లు చటర్జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెన్షనర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, అదనపు కార్యదర్శి కుళ్లాయి బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు



గాయపడిన డ్రైవర్ బాబు నాయక్

గుత్తి రూరల్: మండలంలోని ఊబిచెర్ల గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తా పడి డ్రైవర్ బాబు నాయక్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. పామిడి మండలం పాళ్యంతండాకు చెందిన అతడు హైదరాబాదు నుంచి గ్రామానికి లోడుతో వస్తుండగా ఊబిచెర్ల గ్రామ శివారులో బొలెరో వాహనం బ్రేక్ ఫెయిలయింది. దీంతో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడి ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అతడిని 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

బుక్కరాయసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు రమణయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలోని ఎంఈఓకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు పెండింగ్ ఉన్న పుస్తకాలను మంజూరు చేయాలన్నారు. ఉపాధ్యాయుల సర్వీస్ అప్‌డేట్‌గా నమోదు, మెడికల్ లీవ్, పీఆర్‌సీ వివరాలు అప్‌డేట్ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పాఠశాల గ్రాంట్‌ను విడుదల చేయాలన్నారు. అనంతరం ఎంఈఓ నవీదకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు సుబ్బరాయుడు, గౌస్, పవన్‌కుమార్, హెన్రీ, నారాయణప్ప, శివప్రసాద్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకి ‘ఉత్తమ’ అవార్డు



ఎస్పీ గౌతమిశాలి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి

నార్పల: స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి జిల్లా ఎస్పీ గౌతమీశాలి చేతుల మీదుగా గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఉత్తమ అధికారి అవార్డుతో పాటు ప్రశంసా పత్రం అందుకున్నారు. ఇటీవల నార్పలలో జరిగిన చిన్నారి హత్యకేసును చాకచక్యంగా వ్యవహరించి రెండు రోజుల్లోనే ఛేదించడంతో ఈ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్పీ చేతుల మీదుగా అవార్డు తీసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలందిస్తానన్నారు. ఎస్ఐకి అవార్డు రావడంతో మండల వాసులు హర్షం వ్యక్తం చేశారు.